

చికెన్ బిర్యానీ తిని...

చికెన్ బిర్యానీ తిన్న పలువురు విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. 8లో



శారదానదికి గర్భ శోకం

స్థానిక శారదానదిపై వంతెనకు సమీపంలో అధికార పార్టీకి చెందిన వ్యక్తి అక్రమంగా మట్టి తవ్వకాలు చేపట్టారు. 8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 30.8/31.8

అనకాపల్లి : రాగల ఐదు రోజులు వర్షసూచన ఉందని ప్రాంతీయ వ్యవసాయ పరిశోదనా స్థానం వాతావరణ శాస్త్రవేత్త వి.గౌరి శుక్రవారం పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

గ్రామాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

- జిల్లా పంచాయతీ అధికారి శిరీషారాణి



కంచుగుమల చెత్తతో సంపద తయారీశాలను సందర్శించిన జిల్లాపంచాయతీ అధికారి శిరీషారాణి, నర్సీపట్నం డీఎల్‌పీవో మూర్తి

రోలుగుంట: గ్రామాల్లో పరిసరాలు పరిశుభ్రతతోనే ఆరోగ్యంగా ఉంటాయిని జిల్లా పంచాయతీఅధికారి శిరీషారాణి అన్నారు. మండలంలో ఆమె రోలుగుంట, కంచుగుమల గ్రామాల్లో గల చెత్తతో సంపద తయారీ శాలలను ఈవోపీఆర్డీవో ఎస్.నూకరాజుతో కలిసి సందర్శించారు. తడి, పొడి చెత్తతో తయారు చేస్తున్న సేంద్రియ ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించడంలో పంచాయతీ కార్యదర్శులు రవికిరణ్, మాధురి బాధ్యత వహించాలన్నారు. కేంద్రాల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేసి వాటి అభివృద్ధిపై పలు సూచనలు చేశారు. వర్షాల నేపథ్యంలో రోగాలు ప్రబలే అవకాశం ఉందని, అందువల్ల డ్రైన్లు పరిశుభ్రంగా ఉండాలన్నారు. గ్రామ వీధుల్లో ఎక్కడా చెత్తా ఉండకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఆమె వెంట నర్సీపట్నం డీఎల్‌పీవో మూర్తి ఉన్నారు. కార్యక్రమంలో కంచుగుమల సర్పంచ్ బండారు శ్రీను, పారిశుద్య కార్మికులు పాల్గొన్నారు.

చిల్డ్రన్ ఆర్ట్స్ పోటీల్లో పతకాల పంట



జాతీయ స్థాయి పోటీల్లో మెడల్స్ సాధించిన విద్యార్థులతో గురుకుల ఉపాధ్యాయులు

దేవరాపల్లి : ఆల్ ఇండియా క్రియేటివ్ ఫైనాన్స్ చిల్డ్రన్ ఆర్ట్స్ పోటీల్లో మండలంలోని తెనుగుపూడిలోని డా.బి.ఆర్.అంబేడ్కర్ బాలుర గురుకుల విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారు. గుంటూరులో ఇటీవల జరిగిన ఈ పోటీల్లో గురుకుల విద్యార్థులు రెండు బంగారు, మూడు రజత పతకాలను సొంతం చేసుకున్నారు. పదో తరగతి విద్యార్థి సరసయ్య సాయి, ఆరో తరగతి విద్యార్థి ఎల్.దినేష్ బంగారు పతకాలను, 9వ తరగతి విద్యార్థి జగదీష్, 8వ తరగతి విద్యార్థులు మదన్, సురేంద్ర సిల్వర్ మెడల్స్‌ను సాధించారు. బంగారం, వెండి మెడల్స్‌ను సాధించి విద్యాలయానికి మంచి పేరు తీసుకువచ్చిన విద్యార్థులతో పాటు చిత్రలేఖనంలో తర్ఫీదు నిచ్చిన డ్రాయింగ్ ఉపాధ్యాయుడు అర్జునరావును ఉమ్మడి విశాఖ జిల్లా గురుకుల విద్యాలయాల కోఆర్డినేటర్ ఎస్.రూపావతి, స్థానిక అధ్యాపకులు, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

దంతేవాడ వరకే కిరండూల్ రైళ్లు



తాటిచెట్లపాలెం: కేకే లైన్‌లో నెలకొన్న ప్రతికూల వాతావరణం కారణంగా ఈ మార్గంలో నడిచే ప్రయాణికుల రైళ్లను ఆయా తేదీల్లో గమ్యం కుదిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ తెలిపారు. ఈ నెల ఒకటో తేదీ నుంచి 7వ తేదీ వరకు విశాఖపట్నం-కిరండూల్(08551) పాసింజర్ స్పెషల్, విశాఖపట్నం-కిరండూల్(18514) ఎక్స్‌ప్రెస్ దంతేవాడ వరకు మాత్రమే నడుస్తాయి. ఈ నెల రెండు నుంచి 8వ తేదీ వరకు కిరండూల్-విశాఖపట్నం (08552) పాసింజర్ స్పెషల్, కిరండూల్- విశాఖపట్నం (18513) ఎక్స్‌ప్రెస్ దంతేవాడలో బయలుదేరి విశాఖపట్నం చేరుకుంటాయి. ఈ తేదీల్లో ఈ రైళ్లను దంతేవాడ-కిరండూల్ మధ్య రద్దు చేశారు. ప్రయాణికులు ఈ మార్పులను గమనించాలని ఆయన కోరారు.

9 బస్సులపై కేసు నమోదు

3 బస్సుల సీజ్

గోపాలపట్నం (విశాఖ): విశాఖలో రవాణా శాఖ అధికారులు గురువారం తనిఖీలు చేపట్టారు. నిబంధనలు ఉల్లంఘించిన 9 స్కూల్ బస్సులపై కేసులు నమోదు చేసి, మూడు బస్సులను సీజ్ చేశారు. తనిఖీల్లో మొత్తంగా 60 బస్సులపై కేసులు నమోదు చేయగా 8 బస్సులను సీజ్ చేశారు.

కోతలు మొదలు



నెల	పింఛను దారులు	నగదు రూ. కోట్లలో
జూన్	2,64,526	189.9
జూలై	2,64033	174.6
ఆగస్టు	2,62,624	108.4

అభాగ్యుల పాలిట కూటమి ప్రభుత్వం నిర్దయగా వ్యవహరిస్తోంది. పింఛన్ సొమ్ముపై ఆధారపడి జీవిస్తున్న వారికి గుండెకోత మిగులుస్తోంది. ఖజానాపై భారం తగ్గించుకునేందుకు పేదల జీవితాలను పణంగా పెడుతోంది. ఒకేసారి పింఛన్‌దారులను తగ్గిస్తే వ్యతిరేకత వస్తుందన్న మోసపూరిత ఆలోచనతో నెలనెలా కొంతమంది చొప్పున కోత విధిస్తోంది.

- రెండో నెలలోనే పింఛన్లకు కోత
- ఇప్పటి వరకు 1,409 మంది పెన్షన్ దారులపై వేటు వేసిన కూటమి ప్రభుత్వం
- కొన్ని చోట్ల సర్వర్ పనిచేయలేదంటూ కుంటిసాకులు
- జూలైలో 2,64,033 మంది ఉండగా అగస్టులో 2,62,624 కి తగ్గిన పింఛన్లు

సాక్షి, అనకాపల్లి : అనుకున్నట్టే కూటమి ప్రభుత్వం పింఛన్లలో కోత విధించింది. వరుసగా రెండో నెలలో కూడా కొంత మంది లబ్ధిదారులపై వేటు వేసింది. తెలుగుదేశం పార్టీకి అనుకూలంగా లేరన్న అక్కసుతో స్థానిక నేతల ఒత్తిళ్లతో కొంత మంది పేరు తప్పించారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. అధికారంలోకి వచ్చాక కూటమి ప్రభుత్వం ఈ రెండు నెలల్లోనే కుంటిసాకులు చూపించి కొంత మంది పేర్లు తప్పించడం గమనార్హం. ప్రతి నెలా పెన్షన్‌దారుల సంఖ్య తగ్గుతూ వస్తోంది. మున్ముందు భారీగా సామాజిక పెన్షన్లలో కోత విధించే అవకాశాలు ఉన్నట్లు సంకేతాలు వస్తున్నాయి.

1,409 మంది పింఛన్‌దారులపై వేటు

జిల్లాలో జూలై నెలలో 2,64,033 మంది నుంచి అగస్టు నెలలో 2,62,624లకు పింఛన్ల సంఖ్య తగ్గింది. ఈ గణాంకాల ప్రకారం కేవలం రెండు నెలల్లోనే 1409 లబ్ధిదారులపై వేటు వేసినట్లు స్పష్టంగా తెలుస్తోంది. అయితే ఈ తగ్గింపు వెనుక సాంకేతిక కారణాలు చూపించడానికి అధికారులు అష్టకష్టాలు పడుతున్నారు. కొంత మందికి సర్వర్‌లో సమస్య, మరికొంత మందికి వచ్చే నెల నుంచి వస్తాయని, ఇంకొందరికీ మరో కారణం చెప్పి తప్పించుకొనే ప్రయత్నం చేస్తున్నారు.

భారం తగ్గించుకోడానికే..

ఎన్నికల్లో గెలిచేందుకు చంద్రబాబు అలవికానీ హామీలు గుప్పించారు. రూ.3 వేలు ఉన్న పెన్షన్లను రూ.4 వేలకు పెంచుతానని హామీ ఇచ్చేశారు. తీరా అధికారం చేపట్టాక అది భారంగా పరిణమించినట్టు అర్థమైపోయింది. దీంతో కొంత భారాన్ని తగ్గించుకోవాలన్న నిర్ణయానికి వచ్చింది. మరోవైపు తెలుగుదేశం పార్టీకి అనుకూలంగా లేరన్న అనుమానం ఉన్నా పేరు తప్పించాలని భావిస్తోంది. ఫలితంగా ఈ రెండు కారణాలతో భారీగా లబ్ధిదారుల సంఖ్యలో కోత విధించే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.

ఇందుకోసం గత ప్రభుత్వం మినహాయింపు ఇచ్చిన ఐటీ రిటర్న్స్ ఆప్షన్‌ను మళ్లీ తెరపైకి తీసుకురావాలని భావిస్తున్నట్టు సమాచారం. అలాగే ఇతరత్రా నిబంధనలను సైతం మరింత కఠినతరం చేసి లబ్ధిదారుల సంఖ్య తగ్గించుకోవడం ద్వారా భారాన్ని తగ్గించుకునే ప్రయత్నాలు ఉన్నట్టు సంకేతాలు వస్తున్నాయి. ఇప్పటికే అనధికారికంగా వడపోతకు అవసరమయ్యే ప్రక్రియను ప్రారంభించినట్టు తెలుస్తోంది. త్వరలోనే దీనికి సంబంధించి విధి విధానాలు ప్రకటించే అవకాశాలు ఉన్నాయని అధికార వర్గాల్లో చర్చ జరుగుతోంది.

కోతలోనూ కుట్ర

మరోవైపు తెలుగుదేశం పార్టీకి ఓటు వేయలేదని అనుమానం ఉన్నా, ప్రత్యర్థి పార్టీలకు సంబంధించిన లబ్ధిదారులను తప్పించే కుట్రలు జరుగుతున్నాయి. జిల్లాలో స్థానిక నేతల సహాయంతో అటువంటి వారి జాబితాను రహస్యంగా సిద్ధం చేస్తున్నట్లు పార్టీ వర్గాల గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ రెండు నెలల్లో జరిగిన కోతల్లో కూడా కొంత మందిని అదే తరహాలో స్థానిక నేతల ఒత్తిళ్ల కారణంగా తప్పించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

తొలి రోజు పింఛన్లు పంపిణీ

తొలి రోజు 2,62,624 పింఛన్లుకు గానూ 2,55,421 పించన్లు పంపిణీ చేశారు. 97.21 శాతం మందికి గానూ రూ.105.39 కోట్లు తొలిరోజు పింఛన్లు పంపిణీ చేసినట్లు డీఆర్‌డీవో పీడీ శచిదేవి తెలిపారు.

రెండు రోజుల్లో పింఛన్ల పంపిణీ పూర్తి..

- కలెక్టర్ విజయ కృష్ణన్

తుమ్మపాల : నిర్లక్ష్యానికి తావులేకుండా గురువారం **ఉదయం నుంచి ప్రభు**త్వం సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని కలెక్టర్ విజయ కృష్ణన్ అన్నారు. మండలంలో గోపాలపురం గ్రామంలో తెల్లవారు ఆరు గంటలకు ప్రారంభించిన సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొని పింఛను లబ్ధిదారులకు నగదు పంపిణీ చేశారు. సచివాలయ సిబ్బంది ద్వారా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. రెండు రోజుల్లో అందరికి పింఛన్లు పంపిణీ పూర్తి చేస్తామన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఆ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి సచివాలయ సిబ్బంది సంసిద్ధంగా ఉన్నారన్నారు.

ఎన్టీఆర్ భరోసా పథకం కింద జిల్లాలో 2,62,624 మందికి రూ.108 కోట్ల 41 లక్షల 58 వేల 500 నగదు పంపిణీ చేయనున్నట్లు డీఆర్డీఏ పీడీ కె.శచిదేవి తెలిపారు. మొదటి రోజు గురువారం సాయంత్రం నాటికి 97.26 శాతం 2,55,421 మందికి నగదు పంపిణీ జరిగిందన్నారు.



గోపాలపురంలో సామాజిక భద్రత పింఛను లబ్ధిదారుకు పింఛను నగదు అందిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్

జిల్లావ్యాప్తంగా అన్ని సచివాలయాల సిబ్బంది గురువారం తెల్లవారు 5 గంటల నుంచి పింఛన్ల పంపిణీ ప్రారంభించారని తెలిపారు. అనారోగ్యంతో ఆసుపత్రుల్లో ఉన్న పింఛనుదారుల వద్దకు సచివాలయ సిబ్బంది వెళ్లి పింఛను నగదు అందించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మోహన్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ భూముల కబ్జాకు యత్నాలు

- ఎమ్మెల్యే, ఎంపీ స్పందించరేం?
- ఆక్రమణదారులపై కేసులు పెట్టాలి
- ప్రభుత్వ భూములు కాపాడేందుకు ప్రజలు మద్దతివ్వాలి
- సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం

అనకాపల్లి : స్థానిక గవరపాలెం రాణీగారితోట రహదారిలో సర్వే నంబర్.60 లోని సుమారు రూ.11 వందల కోట్లు విలువైన 29.71 ఎకరాల శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం (అంబికా బాగ్) భూములను పరిరక్షించుకోవలసిన బాధ్యత జిల్లా ప్రజలపై ఉందని సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం అన్నారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో దేవదాయశాఖ భూములపై గురువారం గోడ పత్రికలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూములకు సంబంధించిన వీలునామా, కోర్టు జడ్జిమెంట్, ప్రభుత్వ గెజిట్ తదితర అంశాల ద్వారా ఈ భూములు శ్రీ సీతారామచంద్ర మూర్తి దేవస్థానానికి చెందినవిగానే ఉన్నట్టు ఆయన పేర్కొన్నారు.

ఆర్డీవో జడ్జిమెంట్ వీటిని ధ్రువీకరించిందని, కానీ కొణతాల రజిని కొంత మంది కలిసి ఈ భూములను కాజేయాలని కుట్రపూరితంగా కొన్ని తప్పుడు పత్రాలను నోటరీ ద్వారా రాయించుకొని తమ భూములుగా హైకోర్టులో స్టేటస్‌కో ఇచ్చిందని ఆ భూముల్లోకి అక్రమంగా ప్రవేశించేందుకు ప్రయత్నిస్తున్నారని, దీనిని తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆయన చెప్పారు. దేవదాయశాఖ భూములను ఆక్రమించిన వారిపై పోలీసు కేసులు నమోదు చేసి అరెస్టులు చేయాలని ఆయన కోరారు. పట్టణ నడిరోడ్డులో ఉన్న భూమిపై వారం రోజులుగా దీనిపై జిల్లా అంతటా చర్చ జరుగుతుంటే, స్థానిక ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, ఎంపీ సీఎం రమేష్‌లు ఎందుకు ఇంత ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారో ప్రజలకు చెప్పాలని ఆయన కోరారు.



దేవదాయ భూములతో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న జిల్లా కార్యదర్శి కె.లోకనాథం

రాష్ట్ర ప్రభుత్వం భూ కబ్జాలపై, అవినీతిపై అసెంబ్లీలో పెద్ద ఎత్తున శ్వేత పత్రాలు విడుదల చేసి ఆక్రమణలపైన, భూకబ్జాలపైన చర్చ జరుగుతున్న సమయంలో, అసెంబ్లీ సమావేశాలు ముగిసిన మరుక్షణమే అనకాపల్లి పట్టణంలో దేవదాయశాఖకు చెందిన రూ.11 వందల కోట్ల విలువైన భూములపై అధికార పార్టీ అండదండలతో ఈ ఆక్రమణకు పాల్పడుతున్నట్టుగా తెలుస్తుందన్నారు. 2007లో రాష్ట్ర వ్యాప్తంగా పెద్దఎత్తున జరిగిన భూ పోరాటాల్లో భాగంగా ఈ భూముల్లో సీపీఎం జెండాలను పాతి ఈ భూములను పేదలకు ఇళ్ల స్థలాలుగా ఇవ్వాలని కోరిందని, ఆ సందర్భంలో సీపీఎం నాయకులపై కేసులు పెట్టడంతో పాటు ఇవి దేవదాయ భూములను కాబట్టి ఇవి ఎవరికీ చెందవని ప్రభుత్వ అధికారులు చెప్పడం జరిగిందని అన్నారు. అలాంటి పరిస్థితుల్లో నేడు ప్రైవేటు వ్యక్తులు వచ్చి పొక్లెయిన్‌తో భూమిని చదును చేస్తుంటే అధికారులు, ప్రభుత్వం ఏమి చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. ఈ భూములను ఆక్రమించడానికి ప్రయత్నిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే ప్రజా పోరాటాలకు సిద్ధం కావల్సి వస్తుందని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఆర్.శంకరరావు, అల్లు రాజు, మండల నాయకులు కాళ్ల తెల్లయ్యబాబు, నాగిరెడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కోడ్ అమల్లో ఉన్నా..



నీటిని విడుదల చేస్తున్న మాజీ ఎమ్మెల్యే రామానాయుడు తదితరులు



ప్రధాన గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

- టీడీపీ నేతలతో కోనాం నీటిని విడుదల చేయించిన అధికారులు

చీడికాడ: ఎమ్మెల్సీ కోడ్ అమల్లో ఉన్నా అధికారులకు పట్టలేదు. కోనాం జలాశయ నీటి విడుదల కార్యక్రమాన్ని అధికార పార్టీ నేతల చేతుల మీదుగా చేయించి, తమ స్వామి భక్తిని చాటుకున్నారు. ఇరిగేషన్ అధికారులు దగ్గరుండి మరీ.. మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నేత గవిరెడ్డి రామానాయుడు, మాజీ నీటి సంఘాల డైరెక్టర్ల చేతుల మీదుగా జలాశయం నుంచి గురువారం సాగునీటి కాలువలకు నీటిని విడుదల చేశారు. అనంతరం ఇరిగేషన్ డీఈ వేణుగోపాల్, ఏఈ జయరాం మాట్లాడుతూ జలాశయం నుంచి ఎగువ కాలువకు 50 క్యూసెక్కులు, దిగువ కాలువలకు 150 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు తెలిపారు. జలాశయం పూర్తి స్థాయి నీటిమట్టం 101.25 మీటర్లు కాగా, ప్రస్తుతం జలాశయంలో నీటి నిల్వలు 99.40 మీటర్లు ఉన్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు పేరుపు కొండబాబు, గండి మునలినాయుడు, కుచ్చు కళావతి, పోతల చిన్నంనాయుడు, బీజేపీ నేత మేడపురెడ్డి శ్రీనివాసరావు, నీటి సంఘాల మాజీ డైరెక్టర్లు, ఆయకట్టు రైతులు పాల్గొన్నారు.

సెంట్రల్ ఫార్మసీ లైసెన్స్ రద్దు

మహారాణిపేట: కలెక్టరేట్ ఎదురుగా ఉన్న సెంట్రల్ ఫార్మసీ లైసెన్స్‌ను ఏడు రోజుల పాటు తాత్కాలికంగా రద్దు చేసినట్టు ఔషధ నియంత్రణ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ విజయకుమార్ తెలిపారు. ఇటీవల సెంట్రల్ ఫార్మసీలో పనిచేస్తున్న పలువురు కార్మికులు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. దీంతో జిల్లా కలెక్టర్ సమగ్ర విచారణ చేయాలని డ్రగ్ అసిస్టెంట్ కంట్రోలర్‌ను ఆదేశించారు. ఔషధ నియంత్రణ పరిపాలన విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.విజయకుమార్ సెంట్రల్ ఫార్మసీకి నోటీసు జారీ చేశారు. డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఎం.శ్రీనివాసరావు విచారణ జరిపారు. జాబ్‌మేళా ద్వారా సెంట్రల్ ఫార్మసీలో చేరిన తమను రెండేళ్లుగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని, ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకొని ఇవ్వడం లేదని కార్మికులు వాపోయారు. ప్రతి రోజు 12 గంటలకుపైగా పనిచేయించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగంలో చేరినప్పుడు తెల్ల కాగితాలపైన సంతకాలు చేయించుకున్నారని వివరించారు. తమ సర్టిఫికెట్లు ఇచ్చి న్యాయం చేయాలని కోరారు. ఈ మేరకు అధికారులు సెంట్రల్ ఫార్మసీ లైసెన్స్‌ను తాత్కాలికంగా రద్దు చేశారు.

జాతీయ స్థాయి రోల్‌బాల్ స్కేటింగ్‌కు బుల్లయ్య విద్యార్థిని

సీతంపేట : గత నెల 27, 28 తేదీల్లో విశాఖపట్నంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి రోల్‌బాల్ స్కేటింగ్ పోటీల్లో లంకపల్లి బుల్లయ్య కళాశాల విద్యార్థిని బంగారు పతకాన్ని సాధించింది. కళాశాలలో బీఎస్సీ తృతీయ సంవత్సరం చదువుతున్న ఎం.లక్ష్మితారెడ్డి రాష్ట్ర స్థాయిలో బంగారు పతకం సాధించడమే కాకుండా ఈ నెల 8వ తేదీ నుంచి న్యూఢిల్లీలో జరగనున్న జాతీయ స్థాయి ఐస్ స్కేటింగ్ పోటీలకు ఎంపికైంది. గత ఏడాది గుంటూరులో జరిగిన రోల్‌బాల్ స్కేటింగ్‌లో ప్రతిభ చూపిన లక్ష్మితారెడ్డి జాతీయ పోటీలకు ఎంపికైనట్టు కళాశాల యాజమాన్యం తెలిపింది. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ జి.మధుకుమార్ విద్యార్థిని అభినందించి మరిన్ని పతకాలు తేవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జి.ఎస్.కె.చక్రవర్తి, వ్యాయామ విభాగాధిపతి వై.శ్రీనివాసరావు, ఫిజికల్ డైరెక్టర్ బి.ఆర్.ఎస్.లక్ష్మణరెడ్డి పాల్గొన్నారు.

'అగ్నివీర్' ఓ చక్కని అవకాశం

- అగ్నివీర్ వాయుసేనపై విద్యార్థులకు అవగాహన

యలమంచిలి రూరల్ : భారత ప్రభుత్వం సైన్యంలో చేరడానికి అమలు ప్రవేశపెట్టిన అగ్నిపథ్ స్కీమ్‌లో భాగంగా అగ్నివీర్ వాయుసేన రిక్రూట్‌మెంట్ ప్రక్రియ, ఎంపికైన యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై గురువారం యలమంచిలి గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. విశాఖ వాయుసేన విభాగం నాన్ కమాండింగ్ ఆఫీసర్ సందీప్ విద్యార్థులకు అగ్నివీర్ వాయుసేన విభాగానికి నిర్వహించే ఎంపిక ప్రక్రియ, ఎంపికైన తర్వాత అభ్యర్థులకు ఇచ్చే శిక్షణ, శిక్షణ పూర్తయిన అభ్యర్థులకు భారత వాయుసేనలో వచ్చే ఉద్యోగ అవకాశాల గురించి వివరించారు. అగ్నివీర్ వాయుసేనకు ఎంపికైన అభ్యర్థులకు నాలుగేళ్ల శిక్షణ అనంతరం 25 శాతం అగ్నివీరులకు వాయుసేనలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారని, మిగిలిన వారికి చక్కని నగదు ప్రోత్సాహకం ఇస్తారన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాల్లో 10 శాతం కోటా ఉంటుందని తెలిపారు. శిక్షణ కాలంలో అభ్యర్థులందరికీ మంచి నైపుణ్యంతో డిగ్రీ పూర్తి చేసే అవకాశం ఉంటుందని చెప్పారు. అగ్నివీర్ వాయుసేన భర్తీ, ఇతర అంశాలకు సంబంధించి పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా విద్యార్థులకు తెలియజేశారు. సదస్సుకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ పి. చంద్రశేఖర్ మాట్లాడుతూ ఈ అవకాశాన్ని ఆసక్తి గల యువకులంతా సద్వినియోగపర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ పోలిరెడ్డి, కళాశాల జేకేసీ కోఆర్డినేటర్ పి.వెంకన్న, అధ్యాపకులు పాల్గొన్నారు.



అగ్నివీర్ వాయుసేనపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న నాన్ కమాండింగ్ ఆఫీసర్ సందీప్

పదవి కన్నా సేద్యమే మిన్న...



సేంద్రియ వ్యవసాయ సాగు గురించి సర్పంచ్ జయమ్మకు అవగాహన కల్పిస్తున్న మండల వ్యవసాయాధికారి వాసుదేవరావు



సాగరంలో తన వ్యవసాయ భూమిలో కూలీలతో కలిసి వరినాట్లు వేస్తున్న సాగరం సర్పంచ్ కోట్ని జయమ్మ

- భర్తకు చేదోడుగా వ్యవసాయ పనుల్లో సర్పంచ్ జయమ్మ

మాడుగుల రూరల్ : రాజకీయ పదవులు అంటే నేడు హంగు, ఆర్భాటంతో మెలుగుతున్నారు. అయితే తాను ఒక గ్రామ పంచాయతీకి ప్రథమ పౌరురాలిని అనే హంగు, ఆర్భాటం లేకుండా తాను చేస్తున్న వ్యవసాయ వృత్తిలో భర్తకు చేదోడుగా నిలుస్తోంది అ గ్రామ సర్పంచ్. మండలంలో సాగరం గ్రామ సర్పంచ్‌గా 2021 ఫిబ్రవరి 9వ తేదీన కోట్ని జయమ్మ సర్పంచ్ ఎన్నికల్లో గెలుపొందారు. ఈ పంచాయతీ జనరల్ మహిళకు రిజర్వేషన్ కావడంతో అమె పోటీ చెయ్యడానికి అవకాశం ఏర్పడింది. ఎన్నికలల్లో పోటీ చేసి భారీ మెజార్టీతో సమీప అభ్యర్థిపై అమె భర్త వైఎస్సార్ సీపీ నాయకుడు కోట్ని సన్యాసినాయుడు సహకారంతో జయమ్మ సర్పంచ్‌గా గెలిపొందారు. వ్యవసాయ కుటుంబానికి చెందిన జయమ్మ తమకు వున్న 6 ఎకరాలు భూమిని వారే సొంతంగా వ్యవసాయం చేసుకుంటున్నారు. సర్పంచ్ అయినా సరే అమె నిత్యం వ్యవసాయ పనుల్లో తన భర్తకు చేదోడు, వాదోడుగా నిల్చి ఆదర్శప్రాయంగా నిలుస్తుంది. సర్పంచ్ అంటే హంగు, ఆర్భాటంతో తిరిగే నేటి రాజకీయాల్లో జయమ్మ ఆదర్శ మహిళగా చెప్పక తప్పదు. ప్రస్తుతం జరుగుతున్న ఖరీఫ్ వరినాట్లు వేసే పనిలో అమె తన పంట పొలంలో మహిళా కూలీలతో సమానంగా పనిచేస్తుంది. వరినారు తియ్యడం, వరినాట్లు వేయడంతో పాటు, వరి కోతలు చేపట్టడం, వరిచేను మోత పనుల్లో పాల్గొంటుంది. దీంతో పాటు వరి కుప్పలు పెట్టేడప్పుడు భర్త సన్యాసినాయుడుకు ఎంతో సహకారం అందిస్తుంది.

ప్రకృతి వ్యవసాయం పద్ధతులు ద్వారా తమకు వున్న 6 ఎకరాలు భూమిని సాగు చేస్తున్నారు. తద్వారా అధిక దిగుబడులు సాధిస్తున్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులు అవగాహన పర్చడానికి మండల వ్యవసాయాధికారి వాసుదేవరావు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కూడా క్షేత్ర స్థాయికి వచ్చి అవగాహన పరుస్తున్నారు. సర్పంచ్ అనే ఆర్భాటం లేకుండా తన వృత్తికి కూడా న్యాయం చేస్తున్న సర్పంచ్ జయమ్మను అందరూ అభినందిస్తున్నారు

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

నాకు చిన్నప్పటి నుంచి వ్యవసాయం అంటే ఎంతో ఇష్టం. నేను గ్రామ సర్పంచ్ అయినా సరే నేను నమ్ముకున్న వృత్తిని ఎప్పుడూ వదిలిపెట్టం. భర్త సహకారం, పంచాయతీ ప్రజల ఆదరణతో నేను సర్పంచ్‌గా గెలుపొందాను. సర్పంచ్‌గా గ్రామంలో పారిశుద్యం, వీధి దీపాల ఏర్పాటు, తదితర పనుల్లో చేపడుతూ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నాను.

–కోట్ని జయమ్మ గ్రామ సర్పంచ్, సాగరం, మాడుగుల మండలం

క్లుప్తంగా

ఆదర్శ వివాహం.. ఆపై దాష్టీకం

- దళిత మహిళపై అమానుషం
- భర్త, అత్త వేధింపులపై ఫిర్యాదు



ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న భారతి నుంచి వివరాలు సేకరిస్తున్న పోలీసులు

అచ్యుతాపురం: భర్త పోయిన దుఃఖంలో ఉన్న దళిత మహిళను ఆదర్శ వివాహం చేసుకున్నాడు. కొత్త జీవితాన్నిస్తానని నమ్మబలికాడు. దీంతో భర్త చనిపోయి, భారంగా కాలం వెళ్లదీస్తున్న మహిళ తన భవిష్యత్తును అందంగా ఊహించుకుంది. ఇంతలోనే మళ్లీ అత్త రూపంలో మొదలైన కష్టాలకు, రెండో భర్త దాడులు తోడై ఆమెను ఆస్పత్రి పాలుజేశాయి. సీఐ బుచ్చిరాజు తెలిపిన వివరాలు. మండలంలోని కొనెంపాలెం పరిధిలో తల్లితో నివాసముంటున్న పలివెల భారతికి 2016లో పెరుమాళ్లపల్లి ప్రదీప్‌కుమార్‌తో వివాహం జరిగింది. వీరికి ఒక పాప. 2021లో ప్రదీప్‌కుమార్ అనారోగ్యంతో మరణించాడు. అనంతరం తన తల్లి వద్ద కూతురుతో కలిసి కొనెంపాలెంలో నివాసం ఉంటోంది. అదే ప్రాంతానికి చెందిన అయినవల్లి గణేష్ నూకప్పారావుతో పరిచయం ఏర్పడి, పెళ్లికి దారితీసింది. ఈ ఏడాది మార్చి 28న వివాహం చేసుకున్నారు. వీరి పెళ్లి అప్పారావు తల్లి భూలక్ష్మికి ఇష్టం లేదు. దీంతో తరచూ కోడలిపై తన అయిష్టత వెళ్లగక్కేది. గత నెలాఖరున రాజమ్మ అనే మహిళతో కలిసి దూషించడంతో అనకాపల్లి మహిళా పోలీస్ స్టేషన్‌ను భారతి ఆశ్రయించింది. పోలీసులు భర్తను పిలిచి కౌన్సిలింగ్ ఇచ్చి, పంపారు. దీన్ని మనసులో పెట్టుకున్న భర్త మళ్లీ భారతిపై దాడి చేయడంతో గాయపడ్డ ఆమెను, స్థానిక ప్రైవేట్ ఆస్పత్రిలో తల్లి చేర్పించింది. ఈ మేరకు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బుచ్చిరాజు తెలిపారు.

శారదానదికి గర్భ శోకం

అధికార పార్టీ నేతల అక్రమాలకు అధికారులు వంతపాడుతున్నారు. శారదానది వంతెన పిల్లర్లకు ప్రమాదం వాటిల్లేలా అక్రమ మట్టి, ఇసుక తవ్వకాలకు పాల్పడుతున్నా చర్యలకు ససేమిరా అంటున్నారు. టీడీపీ నేతలు కొనుగోలు చేసిన భూముల్లో రోడ్డు వేసేందుకు ఆగమేఘాల మీద నది ఇసుక, మట్టిని తరలించుకుపోతున్నా చోద్యం చూస్తున్నారు. అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

- యథేచ్ఛగా అక్రమ మట్టి, ఇసుక తవ్వకాలు
- వంతెన ఆనుకుని దర్జాగా తవ్వేస్తున్నారు
- టీడీపీకి చెందిన 'రియల్టర్'పర్యవేక్షణలో దందా
- వంతెనకు ప్రమాదం పొంచి ఉన్నా చోద్యం చూస్తున్న యంత్రాంగం



దేవరాపల్లి శారదా నదిలో పొక్లెయిన్, ట్రాక్టర్లతో మట్టి తరలింపు

దేవరాపల్లి: స్థానిక శారదానదిపై వంతెనకు సమీపంలో అధికార పార్టీకి చెందిన వ్యక్తి అక్రమంగా మట్టి తవ్వకాలు చేపట్టారు. దేవరాపల్లి–వాలాబు రహదారిలో శారదానది వంతెన పిల్లర్లకు కేవలం పది మీటర్ల దూరంలోనే పట్టపగలే దర్జాగా జేసీబీతో మట్టిని తవ్వి తరలించుకుపోతున్నారు. గ్రావెల్ రోడ్డు నిర్మాణానికి రహదారి చదును పేరిట తవ్వకాలు చేపట్టి, ట్రాక్టర్లతో పదుల సంఖ్యలో మట్టి లోడ్లు తీసుకెళ్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా, కనీస అనుమతుల్లేకుండా జరుగుతున్న ఈ వ్యవహారంపై అధికారులు దృష్టిసారించకపోవడాన్ని స్థానికులు ఆక్షేపిస్తున్నారు.

మండలంలోని ఎం.అలమండకు చెందిన టీడీపీ నాయకుడు, రియల్ ఎస్టేట్ వ్యాపారి దగ్గరుండి మరీ ఈ మట్టి తవ్వకాలను చేయిస్తున్నారు. స్థానిక టీడీపీ నేతలే అక్రమ తవ్వకాల భాగోతాన్ని నడిపిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ అవసరాలకైనా ఇసుక, మట్టి తవ్వకాలు చేపట్టాలంటే అధికారుల అనుమతి తప్పనిసరి. అధికారుల అనుమతులున్నా వంతెనకు సుమారు 200 మీటర్ల పరిధిలో ఎలాంటి తవ్వకాలు చేపట్టరాదు. వీటన్నింటినీ తుంగలో తొక్కి మరీ పట్టపగలే వంతెనకు ఆనుకు యంత్రాల సాయంతో వడివడిగా మట్టి, ఇసుకను తరలిస్తున్నా రెవెన్యూ, ఇరిగేషన్ అధికార్లు పట్టించుకోక పోవడం శోచనీయం. ఈ తవ్వకాలతో రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన వంతెనకు ప్రమాదం పొంచివున్నా పట్టించుకోవట్లేదు.

దేవరాపల్లి శారదానదిపై ఉన్న ఈ వంతెన మీదుగా అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన సుమారు 200కు పైగా గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. ఇంతటి ప్రాధాన్యత కల్గిన వంతెనకు ఆనుకుని నదిలో అక్రమ తవ్వకాలపై సమాచారం ఉన్నా, అధికార్లు తవ్వకాలు పూర్తయ్యాక అక్కడికి వెళ్లి, తమకు ఎవరూ కనిపించలేదని చేతులు దులిపేసుకు రావడం విమర్శలకు తావిస్తోంది. సదరు టీడీపీకి చెందిన రియల్టర్‌తో పాటు అదే పార్టీకి చెందిన మరికొందరు వ్యక్తులు శ్మశాన వాటికి పైభాగంలో ఇటీవల కొనుగోలు చేసిన భూములకు రోడ్డు సదుపాయం కోసం ఈ తవ్వకాలకు పాల్పడ్డట్లు తెలిసింది. శారదానది ఒడ్డు నుంచి శ్మశాన వాటికకు రోడ్డు నిర్మించినా, రైవాడ జలాశయ గేట్లు ఎత్తి నీరు విడుదల చేస్తే గట్టు కోరుకుపోయే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

దీనిపై స్థానిక డిప్యూటీ తహసీల్దార్ ఆనంద్‌ను ఆరా తీయగా తమకు అక్రమ మట్టి తవ్వకాలపై ఫిర్యాదు అందిందని, రెవెన్యూ సిబ్బందిని పంపించగా సదరు వ్యక్తులు వాహనాలతో అప్పటికే వెళ్లిపోయారన్నారు. దీనిపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఇరిగేషన్ అధికార్లు మాత్రం వంతెనకు ఆనుకుని తవ్వకాలను జరిగితే ఆర్అండ్‌బీ అధికార్లు చూసుకుంటారని, తమకు సంబంధం లేదంటూ తప్పించుకోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. స్థానిక ఇంజనీరింగ్ అసిస్టెంట్‌ను ఇదే విషయమై ఆరా తీయగా శ్మశాన వాటికకు గ్రావెల్ రోడ్డు నిర్మాణానికి పంచాయితీ నిధులు రూ.4 లక్షలు మంజూరయ్యాయని, తాము ఇంకా ఆ రోడ్డు పనులు ప్రారంభించలేదన్నారు.

బిర్యానీ తిన్న 21 మంది విద్యార్థులకు అస్వస్థత

- ఇద్దరి పరిస్థితి విషమం
- కేజీహెచ్‌కు తరలింపు



ఎస్.కోట ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శిస్తున్న డీఎంహెచ్‌వో భాస్కరరావు

గంట్యాడ: చికెన్ బిర్యానీ తిన్న పలువురు విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో కేజీహెచ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళ్తే... గంట్యాడ మండలం కరకవలస గ్రామంలోని ప్రేమవెలుగు సేవా సంస్థ ఆశ్రమంలో ఎస్.కోట, అనంతగిరి, పాచిపెంట, అరకు, మారికవలస ప్రాంతాలకు చెందిన 46 మంది విద్యార్థులు ఆశ్రయం పొందుతూ కరకవలస, రామవరం, పాఠశాలల్లో చదువుతున్నారు. ఈ నెల 30వ తేదీ రాత్రి విద్యార్థులకు నిర్వాహకులు చికెన్ బిర్యానీ పెట్టారు. అది తిన్న తర్వాత ఇద్దరు విద్యార్థులకు వాంతులు, విరేచనాలు కావడంతో నిర్వాహకులు ఘోషా ఆస్పత్రికి తరలించారు. 31వ తేదీ ఉదయం మరో నలుగురికి వాంతులు విరేచనాలు కావడంతో వారిని కూడా ఘోషా ఆస్పత్రిలో చూపించిన తర్వాత వారి తల్లిదండ్రులను పిలిపించి ఇంటికి పంపించారు. వారిలో 21 మంది విద్యార్థులకు మళ్లీ వాంతులు, విరేచనాలు ప్రారంభం కావడంతో ఎస్.కోట ఆస్పత్రిలో గురువారం వారి తల్లిదండ్రులు చేర్పించారు. వీరిలో మజ్జి సన్యాసమ్మ (9), జన్ని నవ్య (13)ల పరిస్థితి విషమంగా ఉండడంతో విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు.

విద్యార్థులను పరామర్శించిన డీఎంహెచ్‌వో

ఎస్.కోట ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.భాస్కరరావు గురువారం పరామర్శించారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు పూర్తిగా కోలుకున్న వరకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను డీఎంహెచ్‌వో ఆదేశించారు.

ఆశ్రమాన్ని తనిఖీ చేసిన తహసీల్దార్

విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారనే విషయం తెలుసుకున్న వెంటనే తహసీల్దార్ నీలకంఠేశ్వర రెడ్డి, డీఎంహెచ్‌వో భాస్కరరావు కరకవలసలో ఉన్న ప్రేమ వెలుగు సేవా సంస్థ ఆశ్రమాన్ని తనిఖీ చేశారు. ఎంత మంది విద్యార్థులు ఉంటున్నారు, ఎలాంటి ఆహారం తీసుకున్నారన్న వివరాలు నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. వసతి గృహం నిర్వహణ అనుమతులపై ఆరా తీశారు. వసతి గృహ నిర్వహణకు అనుమతులు లేవని తెలిసింది. దీనిపై విచారణకు హాజరు కావాలని తహసీల్దార్ నీలకంఠేశ్వరరెడ్డి నోటీస్ ఇచ్చారు. ప్రాథమిక నివేదికను కలెక్టర్‌కు అందించినట్టు తహసీల్దార్ తెలిపారు.

ఇంటి వద్దకు వెళ్లి పింఛన్ అందించండి

బుచ్చెయ్యపేట : లబ్ధిదారుల ఇంటికెళ్లి పింఛన్ నగదు అందించాలని జిల్లా పంచాయతీ అధికారిణి శిరీషారాణి తెలిపారు. గురువారం పింఛను పంపిణీ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. బుచ్చెయ్యపేట, వడ్డాది, ఎల్‌బీ పురం, బంగారుమెట్ట, లోపూడి తదితర గ్రామాల్లో సచివాలయ సిబ్బంది సక్రమంగా పింఛన్లు పంపిణీ చేపడుతున్నారా లేదా అని పరిశీలించారు. మంచంపైన, దీర్ఘకాలిక రోగులు, దివ్యాంగులు తదితర లబ్ధిదారుల వద్దకే నేరుగా వెళ్లి పింఛను నగదు పంపిణీ చేయాలని సిబ్బందికి సూచించారు. బుచ్చెయ్యపేట మండలంలో గల 35 పంచాయతీ గ్రామాల్లో 10,732 మంది లబ్ధిదారులకు తొలి రోజు 10,382 మందికి 96.72 శాతం మందికి పింఛను నగదు పంపిణీ చేశామన్నారు. మిగిలిన వారికి శుక్రవారం అందిస్తామని ఎంపీడీవో వెంకటాచార్య తెలిపారు.

అత్యాచారాలు, హత్యలపై ప్రభుత్వానిదే బాధ్యత

- ఇంటర్ విద్య సమస్యలు పరిష్కరించాలి
- ప్రభుత్వ నిర్లిప్తతపై పీడీఎస్‌వో నిరసన



అనకాపల్లి జీవీఎంసీ పెద్దహైస్కూల్ వద్ద పీడీఎస్‌వో ఆధ్వర్యంలో విద్యార్థుల ఆందోళన

అనకాపల్లి: కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక రాష్ట్రంలో మహిళలపై అత్యాచారాలు, హత్యలు, దాడులు విపరీతంగా పెరిగాయని పీడీఎస్‌వో రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.భాస్కర్ ధ్వజమెత్తారు. స్థానిక మెయిన్ రోడ్డులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో గురువారం బాలికలు, మహిళలపై అత్యాచారాల, హత్యలపై అవగాహన కార్యక్రమాన్ని చేపట్టి, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మూడు నెలల చిన్నారుల నుంచి 50 ఏళ్ల మహిళల వరకు అనేక రూపాల్లో ప్రతిరోజూ అత్యంత దారుణంగా లైంగిక దాడులు జరుగుతున్నాయని, దీనిపై కూటమి ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. జిల్లాలో ప్రేమించలేదని 13 ఏళ్ల బాలికపై అత్యంత కిరాతకంగా కొడవలితో గొంతు కోసి చంపిన ఘటన, బాత్‌రూమ్‌లో అమ్మాయిపై అత్యాచారం, బ్రాండిక్స్ కంపెనీలో లైంగిక వేధింపులు తాళలేక మహిళ ఆత్మహత్య చేసుకోవడం.. ఇలాంటి సంఘటనలు అన్ని జిల్లాల్లోనూ విపరీతంగా పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశబూరు. ఇన్ని సంఘటనలు జరుగుతున్నా ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం ఆక్షేపణీయమన్నారు. మద్యం, మత్తు పదార్థాలే ఈ ఘాతుకాలకు కారణమని నిందితులు చెప్పినా, వాటిపై ఈ ప్రభుత్వం కఠిన చర్యలు ఎందుకు తీసుకోవట్లేదని ప్రశ్నించారు. పీడీఎస్‌వో రాష్ట్ర కోశాధికారి ఎల్.భాను మాట్లాడుతూ యువతను తప్పుడు భావజాలానికి గురి చేస్తున్న, మత్తులో ముంచి మహిళలపై దాడులకు కారణమవుతున్న అశ్లీల సినిమాలు, సాహిత్యం, మద్యం, మత్తు పదార్థలను నిషేధించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇంటర్ విద్యార్థులకు తక్షణమే పాఠ్య పుస్తకాలు ఉచితంగా అందించి, మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించాలని, గెస్ట్ ఫ్యాకల్టీలను రెగ్యులరైజ్ చేయాలని, కాలేజీ విద్యార్థులకు తగిన సమయాల్లో బస్సు సౌకర్యాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మెస్ బిల్లులు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధుల్ని తక్షణమే విడుదల చేయాలన్నారు. ఢిల్లీలోని రావూస్ కోచింగ్ సెంటర్లో జరిగిన ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపించి, దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌వో నాయకులు ఎం.గరగనాయుడు, ఎ.సాయి, ఎం.కుమార్, గణేష్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా రుణాల దోపిడీపై చర్యలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న రమాదేవి

- ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమాదేవి

అనకాపల్లి: నకిలీ డ్వాక్రా గ్రూపులను సృష్టించి, బ్యాంకులు, డీఆర్‌డీఏ అధికారుల అండదండలతో సీపీ మంగతాయారు రూ.15 లక్షలు కాజేసినట్లు ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమాదేవి ఆరోపించారు. స్థానిక సీఐటీయూ జిల్లా కార్యాలయంలో ఐద్వా జిల్లా కార్యదర్శి వరలక్ష్మి అధ్యక్షతన గురువారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మండలంలోని సత్యనారాయణపురంలో జరిగిన ఈ దోపిడీలో అసలు బ్యాంకు ఖాతాలే లేని వ్యక్తికి బ్యాంకు రుణాలు మంజూరు చేయించడం దారుణమన్నారు. బినామీ గ్రూపులతో శ్రీనిధి, ముద్ర వంటి రుణాల ద్వారా కూడా భారీగా నగదు కాజేసినట్లు పేర్కొన్నారు. దీనిపై వెలుగు అధికారులకి, పోలీసులకు, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదులు చేసినా స్పందించకపోవడం ఆక్షేపణీయమన్నారు. దీనిపై విచారణ చేపట్టి, దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా సహాయకార్యదర్శి ఆర్.లక్ష్మి, నాయకులు యు.నాగమణి, యు.లోవ, ఎస్.రాణి, దుర్గ, రేవతి, నూకరత్నం, నాగమణి, నిర్మల, ధనలక్ష్మి, నాగరత్నం, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గజరెడ్డిపాలెంలో దొంగల హల్‌చల్

- అర్ధరాత్రి గృహిణి మెడలో 3 తులాల పుస్తెల తాడు అపహరణ

రాంబిల్లి(యలమంచిలి): అర్ధరాత్రి ఓ ఇంట్లో చొరబడిన దొంగలు ఇంట్లో నిద్రపోతున్న గృహిణి మెడలో 3 తులాల బంగారు పుస్తెల తాడును అపహరించిన ఘటన రాంబిల్లి మండలం గజిరెడ్డిపాలెం గ్రామంలో చోటు చేసుకుంది. రాంబిల్లి సీఐ సిహెచ్ నర్సింగరావు తెలిపిన వివరాలివి. రాంబిల్లి మండలం గజరెడ్డిపాలెం గ్రామానికి చెందిన ఎరిపిల్లి నూకమ్మ బుధవారం అర్ధరాత్రి తన ఇంటిలో నిద్రిస్తుండగా గుర్తు తెలియన వ్యక్తి ఆమె మెడలో ఉన్న 3 తులాల బంగారు పుస్తెల తాడును ఆపహరించుకుపోయాడని పోలీసులకు గురువారం ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు. చోరీలపై ప్రత్యేక నిఘా పెడుతున్నామని గ్రామాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎవరైరా అపరచిత వ్యక్తులు కనబడిన వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందజేయాలని ఆయన ఓ ప్రకటనలో కోరారు.

గంజాయి మత్తులో గిరిజనుడిపై దాడి

- రూ. 500 ఇవ్వలేదని దారుణం
- నలుగురిని పోలీసులకు అప్పగించిన స్థానికులు



దాడిలో గాయపడిన ఎర్రయ్య

దేవరాపల్లి : దేవరాపల్లిలో గంజాయి, ఇతరత్ర మత్తుపదార్థాలకు బానిసలైన కొందరు యువకులు సైకోల్లా ప్రవర్తిస్తూ ప్రజలను తీవ్ర భయాభ్రాంతులకు గురి చేయడంతో పాటు దాడులకు సైతం తెగపడుతున్నారు. ఈ క్రమంలోనే తాజాగా గురువారం మరో ఘటన వెలుగు చూసింది. అల్లూరి జిల్లా పినకోట పంచాయితీ వీరభద్రపురానికి చెందిన గిరిజనుడు తేడా ఎర్రయ్యపై గంజాయి మత్తులో నలుగురు సైకోలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. ఎర్రయ్య విశాఖ కేజీహెచ్‌లో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న తన కుమార్తె దగ్గరకు వెళ్లి తిరిగి గురువారం దేవరాపల్లికి చేరుకున్నాడు. తమ గ్రామానికి వెళ్లే ఆటో కోసం ఆటో స్టాండ్ వద్ద వేచి ఉండగా అక్కడికి నలుగురు యువకులు వచ్చి రూ. 500 ఇవ్వాలని అడిగారు. తన దగ్గర అంత సొమ్ము లేదని చెప్పడంతో గంజాయి మత్తులో ఉన్న నలుగురు వ్యక్తులు గిరిజనుడిపై దాడికి దిగారు. పక్కనే ఉన్న టైల్స్ పెంకుతో తలపై బలంగా కొట్టడంతో ఎర్రయ్య తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు వారిని పట్టుకొని పోలీసులకు అప్పగించారు. గాయపడిన గిరిజనుడిని దేవరాపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేయించారు. సైకోలను కఠినంగా శిక్షించి తమ ప్రాణాలకు రక్షణ కల్పించాలని గ్రామస్తులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

బాలికను వేధించిన వ్యక్తిపై కేసు నమోదు

రాంబిల్లి (యలమంచిలి): మైనర్ బాలికను ప్రేమ పేరుతో వేధించిన యువకుడిపై గురువారం కేసు నమోదు చేసినట్లు రాంబిల్లి సీఐ సిహెచ్. నర్సింగరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీఐ తెలిపిన వివరాలు ప్రకారం మండలంలో వాడనర్సాపురం గ్రామానికి చెందిన చెల్లూరి చిన్ను (22) అనే వ్యక్తి ఒక మైనర్ బాలికను తరచూ వెంటపడి ప్రేమించమని వేధిస్తున్నాడని బాలిక కటుంబ సభ్యులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని, సదరు యువకుడు పరారీలో ఉన్నాడని సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒడిశా వాసి మృతి

రాంబిల్లి (యలమంచిలి) : రోడ్డు ప్రమాదంలో ఒడిశా వాసి మృతి చెందిన ఘటన బుధవారం అర్ధరాత్రి రాంబిల్లి మండల పరిధిలో ఉన్న ఒక ప్రైవేట్ పరిశ్రమ వద్ద చోటు చేసుకుంది. రాంబిల్లి సీఐ సిహెచ్.నర్సింగరావు తెలిపిన వివరాలివి. ఒడిశా రాష్ట్రం నహంగా జిల్లా, నహంగా మండలం, బిర్నిలకాంత్‌పూర్ గ్రామానికి చెందిన బిశ్వజిత్ పండా రాంబిల్లి మండలం పరిధిలో ఉన్న ఒక ప్రైవేట్ పరిశ్రమలో పని చేస్తున్న పండా బుధవారం రాత్రి అచ్యుతాపురం వెళుతుండగా మార్గమధ్యంలో లారస్ పరిశ్రమ సమీపంలో తను ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనం రోడ్డు పక్కన డివైడర్‌ను ఢీకొనడంతో తీవ్ర గాయాల పాలై మృతి చెందాడు. దీనిపై బంధువుల ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.

సైబర్ నేరగాళ్లకు చిక్కి.. రూ.94 వేలు మాయం

దేవరాపల్లి: సైబర్ నేరగాళ్ల బారినపడి దేవరాపల్లికి చెందిన యువకుడు కదిరి ప్రసాద్ తన బ్యాంక్ ఖాతా నుంచి రూ.94 వేలు పోగొట్టుకున్నాడు. దీంతో బాధిత యుడకుడు సైబర్ క్రైమ్‌తో, పాటు దేవరాపల్లి పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశాడు. దేవరాపల్లి ప్రభుత్వ మద్యం షాపులో సేల్స్‌మెన్‌గా పనిచేస్తున్న ప్రసాద్ తన పీఎఫ్ నగదు కోసం తిమిరాం మద్యం షాపులో పనిచేస్తున్న చిన్నని సంప్రదించాడు. అతడు దేశపాత్రుపాలేనికి చెందిన విజయ్ అనే వ్యక్తిని సంప్రదించాలని బుధవారం రాత్రి ఫోన్ నంబర్ ఇచ్చాడు. అతడికి ఫోన్ చేయగా ఆధార్, బ్యాంక్ ఖాతా నంబర్ అడగడంతో ప్రసాద్ చెప్పాడు. రాత్రి 8 గంటల ప్రాంతంలో ఓటీపీ చెప్పాల్సిందిగా ఫోన్లో అడగడంతో ప్రసాద్ చెప్పాడు. 20 నిముషాల వ్యవధిలోనే సైబర్ నేరగాళ్లు ఖాతాను హ్యాక్ చేసి రూ.94 వేలు దోచేశారు. తన ఖాతా నుంచి రూ.50 వేలు అమిత్‌కుమార్ అనే వ్యక్తికి చెందిన ఎస్ బ్యాంక్ ఖాతాలోకి, అభుహ అనే వ్యక్తికి చెందిన బ్యాంక్ ఆఫ్ బరోడా ఖాతాకు రూ.44 వేలు జమ అయినట్లు గుర్తించి బాధితుడు ప్రసాద్ అప్రమత్తమయ్యాడు. బ్యాంక్‌కు సమాచారం అందించి ఖాతా లావాదేవీలను నిలుపుదల చేయించాడు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

హత్య కేసులో ఇద్దరికి రిమాండ్

యలమంచిలి రూరల్ : పట్టణంలో సంచలనం కలిగించిన స్వర్ణకారుడు సున్నం సతీష్‌కుమార్ (38) హత్య కేసులో మరో ఇద్దరి నిందితులకు యలమంచిలి ఏజేఎఫ్‌సీఎం కోర్టు శుక్రవారం రిమాండ్ విధించింది. పోలీసుల దర్యాప్తులో పరవాడకు చెందిన సాయికృష్ణ, మల్కాపురానికి చెందిన పీఎస్ఎన్ మూర్తిలకు ఈ హత్యలో ప్రమేయం ఉన్నట్టు తేలడంతో ఇద్దరిని అరెస్ట్ చేసి శుక్రవారం కోర్టులో ప్రవేశపెట్టామని యలమంచిలి సీఐ షేక్ గఫూర్ తెలిపారు. జూన్ 27న యలమంచిలి పట్టణంలోని తులసీనగర్ నివాస గృహంలో సోదరుడు సతీష్‌కుమార్‌ను హత్య చేసిన తర్వాత కేసులో ఏ2గా ఉన్న దేవులపల్లి రాజేష్ తనకు బాల్య స్నేహితులైన సాయికృష్ణ, పీఎస్ఎన్ మూర్తిలకు ఫోన్ చేసి హత్య విషయం చెప్పాడు. మృతదేహాన్ని పూడ్చిపెట్టడానికి వారితో ప్రణాళిక రచించిన తర్వాత వారిద్దరూ తర్వాత రోజు యలమంచిలి వచ్చారు. కారులో మృతదేహాన్ని ఎస్ రాయవరం మండలం దార్లపూడికి తరలించి పోలవరం ఎడమ ప్రధాన కాలువ వంతెన కింద పూడ్చిపెట్టారు.ఈ కేసులో జూలై 4న ఏ1 సున్నం సాయి మనోజ్ కుమార్, ఏ2 దేవులపల్లి రాజేష్‌లను ఇప్పటికే అరెస్ట్ చేయగా శుక్రవారం మరో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్టు సీఐ తెలిపారు. నిందితుల్లో సాయికృష్ణ రాంకీ ఫార్మాలో పని చేస్తుండగా,మరో నిందితుడు పీఎస్ఎన్ మూర్తి విశాఖ పోర్టులో ప్రైవేటు కార్మికునిగా పనిచేస్తున్నాడు. నిందితులిద్దరినీ విశాఖ కేంద్ర కారాగారానికి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్టు చెప్పారు.దీంతో ఈ కేసులో అరెస్టైన వారి సంఖ్య నలుగురికి చేరింది.

క్లుప్తంగా

తొలగని ఫ్లెక్సీలు, కటౌట్లు

కశింకోట : మండలంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చినా రాజకీయ పార్టీల నాయకుల ఫ్లెక్సీలు తొలగించలేదు. విశాఖ ఎమ్మెల్సీ ఎన్నిక నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. దీంతో రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు, కటౌట్లు తొలగించి, నాయకుల విగ్రహాలకు ముసుగులు వేయాల్సి ఉంది. అయితే అటువంటి నిబంధనలు ఇక్కడ పాటించలేదు. ప్రభుత్వ కార్యాలయాల్లో మాత్రం తొలగించామని, రోడ్లపైన, వీధుల్లో కట్టిన ఫ్లెక్సీల తొలగింపుపై ఉన్నతాధికారుల నుంచి స్పష్టమైన ఆదేశాల రావలసి ఉందని, అవి వచ్చాక తొలగిస్తామని అధికారులంటున్నారు. ఈ విషయమై ఎంపీడీవో శేషుబాబును సంప్రదించగా రోడ్లు, వీధుల్లో రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు, కటౌట్ల తొలగింపుపై ఉన్నత అధికారుల నుంచి స్పష్టత రావలసి ఉందన్నారు. ఈ నేపథ్యంలో వాటి తొలగింపునకు చర్యలు చేపడతామన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు తొలగించి, విగ్రహాలకు ముసుగులు వేయడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు.

బంగారం దుకాణంలో అగ్నిప్రమాదం


మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది

అనకాపల్లి : పట్టణంలో సీఎంఆర్ షాపింగ్ మాల్ పక్కన బంగారు ఆభరణాల తయారీ దుకాణంలో గురువారం సాయంత్రం అగ్నిప్రమాదం సంభవించింది. ఈ మేరకు దుకాణ యాజమాని నక్కా రాజు అందించిన సమాచారంతో మంటలను అదుపు చేసినట్లు అగ్నిమాపక కేంద్రం అధికారి బి.నర్సింగరావు తెలిపారు. దుకాణంలో గ్యాస్ లీకై ప్రమాదం సంభవించినట్లు ఆయన తెలిపారు. సుమారు రూ. లక్షా 50 వేల వరకు నష్టం జరిగి ఉండవచ్చని అంచనా వేశారు.

మండలంలో 97.8 శాతం పింఛన్ల పంపిణీ

కశింకోట : మండలంలో 97.8 శాతం మందికి గురువారం పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో శేషుబాబు తెలిపారు. వృద్ధాప్య, దివ్యాంగ, వితంతు, ఇతర పింఛన్లు కలిపి 10,433 పింఛన్లకు గాను ఇంకా 230 మందికి పింఛన్ అందించాల్సి ఉందన్నారు. వీరిలో 37 మంది మృతులున్నారని, మరికొందరు తీర్థయాత్రలు, ఇతర ప్రాంతాలకు వెళ్లారన్నారు. వారు వస్తే శుక్రవారం మిగిలిన పింఛన్ సొమ్ము అందజేస్తామన్నారు.

బెల్లం ధరలు

అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు గురువారం 31 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	5,180	5,180
రెండో రకం	---	---
మూడోరకం	3,350	3,500

అనకాపల్లి సినిమాలు

శివం భజే	: రాజా
కల్కి 2898ఏడీ	: సత్యనారాయణ స్క్రీన్-1
బడ్డీ	: సత్యనారాయణ స్క్రీన్-2
అలనాటి రామచంద్రుడు	: పర్తిసాయి
డార్లింగ్	: షిర్డిసాయి
తిరగబడరస్వామి	: వెంకటేశ్వర
విరాజి	: శ్రీసత్య
ఉషాపరిణయం	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్త నిధి కేంద్రంలో 47 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్–7 యూనిట్లు, బీ పాజిటివ్–14 యూనిట్లు, ఓ పాజిటివ్–24 యూనిట్లు, ఏబీ పాజిటివ్–2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషన్ యు.లోకేష్ (9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 415 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 376 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ (08924223595)ని సంప్రదించవచ్చు.

అమ్మపాలు అమృత సమానం

- ఘనంగా తల్లిపాల వారోత్సవాలు
- శిశువులకు తల్లి పాల ఆవశ్యకత వివరించిన వైద్య సిబ్బంది


తుమ్మపాల సీహెచ్‌సీ వద్ద వైద్య సిబ్బంది తల్లిపాల వారోత్సవ ర్యాలీ


నూతలగుంటపాలెంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

అనకాపల్లి : శిశువు జన్మించిన అరగంటలోపు ముర్రుపాలు బిడ్డకు ఇచ్చినట్లయితే తల్లీబిడ్డ ఆరోగ్యంగా జీవించవచ్చని తుమ్మపాల పీహెచ్‌సీ వైద్యురాలు నీలిమ తెలిపారు. మండలంలో తుమ్మపాల పీహెచ్‌సీలో తల్లి పాల వారోత్సవాలను పురస్కరించుకుని గురువారం నిర్వహించిన ర్యాలీలో ఆమె మాట్లాడారు. తల్లిపాలలో రోగనిరోధక శక్తి పుష్కలంగా ఉంటుందన్నారు. తల్లిపాలు బిడ్డకు ఇవ్వడం వల్ల తల్లులకు బ్రెస్ట్ క్యాన్సర్ నుంచి విముక్తి లభిస్తుందని తెలిపారు. ఆరుమాసాల పాటు బిడ్డకు తల్లి పాలు రోజుకు 8 నుంచి 10 సార్లు ఇవ్వాలని ఆమె తెలిపారు. దీని వల్ల తల్లీబిడ్డల మధ్య దృఢమైన బంధం ఏర్పడుతుందన్నారు. బిడ్డకు సరిపైన పోషకాలు అందుతాయన్నారు. అంతకు ముందు పాపయ్యసంతపాలెం గ్రామంలో వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ అధికారి డి.శారద, వైద్య సిబ్బంది, మరియమ్మ, మంగమ్మ, నవ్య, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపాలెంలోని 3వ అంగన్‌వాడీ కేంద్రంలో..

కశింకోట : మండలంలోని రెండు చోట్ల గురువారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. తాళ్లపాలెంలోని 3వ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమాన్ని ఐసీడీఎస్ సీడీపీవో పి. ప్రభావతి, అక్కడి పీహెచ్‌సీ వైద్యాధికారి యు. రమేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా తల్లి పాల ప్రాముఖ్యత గురించి అవగాహన కలిగించారు. వైద్యాధికారి రమేష్ మాట్లాడుతూ శిశువు జన్మించిన నాటి నుంచి ఆరు నెలల వరకు తల్లి పాలు మాత్రమే అందివ్వాలన్నారు. దీనివల్ల వ్యాధి నిరోధక శక్తి పెరిగి శిశువు మానసిక, శారీరక ఎదుగుదలకు దోహదపడుతుందని అన్నారు. తల్లి పాలు శిశువు పుట్టిన గంటలోపే పట్టాలన్నారు. దీనివల్ల క్యాన్సర్, మధుమేహం, స్థూలకాయం వంటి వ్యాధులు దరి చేరవన్నారు. అంగన్‌వాడీ కేంద్రం పర్యవేక్షకురాలు వి. సుచరిత మాట్లాడుతూ తల్లి పాల వారోత్సవాల్లో ప్రజలు భాగస్వామ్యం అయి విజయవంతం చేయాలన్నారు. శిశు మరణాలు తగ్గించడానికి తల్లి పాలు దోహదపడతాయన్నారు. ఆరోగ్య బోధకుడు ఎంఎస్‌వీ ప్రసాద్, ఆరోగ్య విస్తరణాధికారి వీపీ సుబ్బారావు, ఆరోగ్య పర్యవేక్షకురాలు ఆర్. వెంకటలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ కె. అరుణ, ఏఎన్ఎం ఎన్. అన్నమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు ఆదిలక్ష్మి, ఎ. బొర్రమ్మ, ఆశ కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

నూతలగుంటపాలెంలో..

మండలంలోని నూతలగుంటపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో తల్లి పాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లి పాల ప్రాధాన్యతను వివరిస్తూ వైద్య, ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు అవగాహన ర్యాలీ నిర్వహించారు. తాళ్లపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి మనీషా మాట్లాడుతూ పిల్లలకు పాలు పట్టడానికి నిర్ణీత వ్యవధి, పరిశుభ్రత, పద్ధతులు పాటించాలన్నారు. తల్లి పాలు బిడ్డకు శ్రేష్ఠమైనవన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ వంశీప్రియ మాట్లాడుతూ తల్లి పాల సంస్కృతిని ప్రోత్సహించడానికి తల్లి పాల వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. మొదటి ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలన్నారు. ఆ తర్వాత రెండేళ్ల వరకు, అంత కంటే ఎక్కువ కాలం తల్లి పాలు ఇవ్వడం శ్రేయస్కరమన్నారు. నిర్దిష్ట పోషణ విధానాలు అవలంబించాలన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ మానస, హెల్త్ సూపర్‌వైజర్ శంకరరావు, మహిళా పోలీసు సహాయకురాలు ధనలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్త జ్యోతి, ప్రజలు, తల్లులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ ఆస్పత్రిలో..

తుమ్మపాల : పుట్టిన ప్రతి బిడ్డకు తల్లిపాలు అందించడం ద్వారా వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని, కనుక ప్రతి బిడ్డకు తల్లి పాలు అందించాలని జిల్లా పబ్లిక్ హెల్త్ నర్సింగ్ అధికారి నాగమణి అన్నారు. స్థానిక ఎన్టీఆర్ ఆస్పత్రిలో గురువారం తల్లిపాల వారోత్సవాలను జిల్లా వ్యాధినిరోధక టీకాల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లి పాల ప్రాముఖ్యతపై నినాదాలు చేస్తు ఆస్పత్రి ఆవరణలో ర్యాలీ చేపట్టారు. ముర్రుపాల ఆవశ్యకత, ఆరు మాసాల వరకు క్రమం తప్పకుండా తల్లిపాలు బిడ్డకు ఇవ్వాలని తెలిపారు. తల్లిపాల ద్వారానే తల్లీబిడ్డలకు అనుబంధం పెరుగుతుందన్నారు. తద్వారా క్యాన్సర్ వంటి రుగ్మతలు రాకుండా కాపాడుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి కె.చంద్రశేఖర్‌దేవ్, గణాంక శాఖ అధికారి రామచంద్రరావు, హెల్త్ ఎడ్యుకేటర్లు శివరామకృష్ణ, వెంకటలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.


పాపయ్యసంతపాలెంలో తల్లిపాల వారోత్సవాలపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది


తాళ్లపాలెంలో తల్లి పాల వారోత్సవంలో మాట్లాడుతున్న పీహెచ్‌సీ వైద్యాధికారి రమేష్


ర్యాలీలో పాల్గొన్న ఎన్టీఆర్ ఆస్పత్రి వైద్య సిబ్బంది

సర్వరోగ నివారిణి యోగ

తుమ్మపాల : యోగా, మెడిటేషన్‌తో దీర్ఘకాలిక వ్యాధులు, అనారోగ్య సమస్యలు దూరం అవుతాయని శ్రీసీతారామ భజన గురువు చూచుకొండ రమణ, వెంకటలక్ష్మి దంపతులు అన్నారు. కేఎస్ఆర్ పేటలో వారి గృహంలో యోగా టీచర్ బాలమణి ఆధ్వర్యంలో గురువారం యోగా శిక్షణ తరగతులు ప్రారంభించారు. 11 రోజుల పాటు తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనారోగ్య సమస్యలు ఉన్న ప్రతి ఒక్కరు యోగా చేయాలని కోరారు. ఐదు నెలల క్రితం కేవలం 10 మందితో ప్రారంభించిన కార్యక్రమంలో నేడు 70 మంది ఉన్నారన్నారు. యోగా వలన వ్యాధుల నుండి ఉపశమనం లభిస్తుందన్నారు. యోగా టీచర్లు చరగడం వెంకటరావు, వేగి రమణ, పొలమరశెట్టి సంధ్య, కె. చంద్రలక్ష్మి, విజయ్ యోగాసనాలు వేయించారు.

ఎన్నికల నోటిఫికేషన్ విడుదల


ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేస్తున్న హెచ్ఎం శర్మ

అనకాపల్లి : జీవీఎంసీ పెద్ద హైస్కూల్ ఆవరణలో ఈనెల 8న పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు జరగనున్నాయని, వాటిలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొనాలని పెద్ద హైస్కూల్ హెచ్ఎం శర్మ తెలిపారు. గురువారం పాఠశాల ఆవరణలో ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అదేరోజు ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. ఎలక్టెడ్ సభ్యులు (ప్రతి తరగతి నుంచి ముగ్గురు), చైర్మన్, వైస్ చైర్మన్, ఎక్స్ అఫీషియో సభ్యులు, కో ఆప్టెడ్ సభ్యులకు ఎన్నికలు జరుగుతాయని ఆయన తెలిపారు.

వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌ను కలిసిన పార్టీ శ్రేణులు


వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డితో కార్పొరేటర్లు, పార్టీ నాయకులు తదితరులు

అనకాపల్లి : తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో గురువారం మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీతా జానకీ రామరాజు, 81వ వార్డు నుంచి పీలా లక్ష్మీసౌజన్య, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి జాజుల రమేష్ కలిసి జగన్‌ను శాలువాతో సత్కరించారు. అనంతరం వార్డు పరిధిలో సమస్యలను జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్, కశింకోట పార్టీ మండల అధ్యక్షుడు మలసాల కిషోర్, పార్టీ సీనియర్ నాయకులు కలగా గున్నయ్యనాయుడు, మలసాల కుమార్‌రాజా తదితరులు పాల్గొన్నారు.

ఆశవర్కర్ల సమస్యలు పరిష్కరించాలని వినతి


ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న ఆశవర్కర్లు

అనకాపల్లి : ప్రభుత్వాలు మారినా రాష్ట్రంలో ఆశ వర్కర్ల సమ్యలు పరిష్కరించడంలో ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాయని ఏపీ ఆశ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా అధ్యక్షురాలు కె. శాంతి అన్నారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణకు ఆశ వర్కర్ల సమస్యలపై గురువారం వినతిప్రతం అందజేశారు. ఆశ వర్కర్లపై పని ఒత్తిడి తగ్గించాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఆశ వర్కర్లు అందరికీ అమలు చేయాలని. గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, రిటైర్మెంట్ వయసుని 62 సంవత్సరాలకు పెంచాలని, రిటైర్ అయిన ఆశ కార్యకర్తలకు గ్రాట్యుటీ అమలు చేయాలని, ఖాళీగా ఉన్న ఆశ కార్యకర్తల పోస్టులు భర్తీ చేయాలని వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్ల జిల్లా కోశాధికారి సూర్యకుమారి, సభ్యులు సీహెచ్ వెంకటలక్ష్మి, ఆడారి అన్నపూర్ణ, నాగమణి, విజయ, భవానీ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ బకాయిలు చెల్లించాలని వినతి


పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న ఉపాధి హామీ కార్మికులు

రాంబిల్లి (యలమంచిలి) : ఉపాధి హామీ బకాయిలు వెంటనే చెల్లించాలని పంచదార్ల గ్రామ ఉపాధి హామీ కార్మికులు కోరారు. ఈ మేరకు గురువారం మండలంలోని పంచదార్లలో ఉపాధి హామీ కార్మికులు, సీఐటీయూ నాయకులతో కలిసి గురువారం స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో సుమారుగా 300 నుంచి 400 మంది ఉపాధి హామీ పథకం కూలీలు పనిచేస్తున్నారని తెలిపారు. వీరికి రెండు వారాల నుంచి గరిష్టంగా 10 వారాల వరకు ఉపాధి హామీ పథకం బకాయిలు చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మండుటెండలో చెరువుల్లో మట్టి మోశామని, నేటికీ మా బకాయిలు ప్రభుత్వం ఇవ్వలేదని వాపోయారు. ఇన్ని వారాల పాటు బకాయిలు చెల్లించపోతే ఎలా బతకగలమని ఆందోళన చెందారు. మా పరిస్థితిని ప్రభుత్వం అర్థం చేసుకుని బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర బడ్జెట్‌లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి నిధులు పెంచాలని, ఏడాదికి కుటుంబానికి రెండు వందల రోజులు పనులు కల్పించాలని, పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలను అదుపులోకి తీసుకురావాలని, రోజు కూలీ రూ.600కు పెంచాలని సీఐటీయూ నాయకులు కోరారు. కార్యక్రమంలో గ్రామ ఉపాధి హామీ పథకం మహిళా కూలీలు, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

5న వయోవృద్ధుల సమావేశం

అనకాపల్లి : గ్రామీణ వయోవృద్ధుల సంక్షేమ సంఘం జిల్లా సమావేశం ఈనెల 5న స్థానిక గవరపాలెం వీవీ రమణ రైతు భారతి హాల్లో ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు సంఘం వ్యవస్థాపకుడు కాండ్రేగుల అప్పారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విశాఖ జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి విచ్చేయనున్నట్లు ఆయన తెలిపారు. సంఘం సభ్యులందరూ హాజరు కావాలని ఆయన కోరారు.

స్వయంభువుడికి కూరగాయల అలంకరణ



మాకవరపాలెం: స్వయం భూ లింగానికి కూరగాయలతో అలంకరణ చేశారు. శుక్రవారం ఆరుద్ర నక్షత్రం పురస్కరించుకుని గురువారం మండలంలోని పెద్ద మిల్లు జంక్షన్ వద్దనున్న వామలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా అన్ని రకాల కూరగాయలతో స్వయం భూ లింగానికి అలంకరణ చేశారు. ఆలయ అర్చకుడు దొరబాబు మాట్లాడుతూ శుక్రవారం మధ్యాహ్నం ఈ కూరగాయలతో వంటలు చేసి, భక్తులకు అన్నసమారాధన చేయనున్నట్లు తెలిపారు.

'తల్లికి వందనం' తక్షణమే అమలు చేయాలి

అనకాపల్లి: నిరుపేద విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని తల్లికి వందనం పథకాన్ని కుటుంబంలో ఎంతమంది విద్యార్థులు ఉంటే అంతమందికీ తక్షణమే అమలు చేయాలని సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు బల్లా నాగభూషణం గురువారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా వేలాది మంది పేద విద్యార్థులు ఈ పథకంలో రూ.15 వేలు చొప్పున ఎప్పుడు వేస్తారోనని ఆశగా ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాలకు రాష్ట్ర ప్రజలు ఆశపడి అత్యధిక మెజార్టీతో కూటమి ప్రభుత్వాన్ని గెలిపించారని, ఆ పథకాలను ఎప్పటి నుంచి అమలు చేస్తారో ప్రభుత్వం ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాల నుంచి ఫీజుల కోసం ఒత్తిడి మొదలయిందన్నారు. విద్యార్థులు పూర్తి వివరాలు ఆన్‌లైన్లో అందుబాటులో ఉన్నాయని, ఆ మేరకు వెంటనే పథకాన్ని అర్హులైన విద్యార్థులకు అమలుచేయాలన్నారు.

ఎమ్మార్పీఎస్ పోరాటాల ఫలితమే ఈ తీర్పు


కొత్తూరు జంక్షన్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న నాయకులు


భీముని గుమ్మం వద్ద మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

తుమ్మపాల : ఎస్సీ వర్గీకరణపై ఎమ్మార్పీఎస్ సుదీర్ఘ పోరాట ఫలితమే నేడు వెలువడిన సుప్రీం కోర్టు తీర్పు అని ఉత్తరాంధ్ర ఎమ్మార్పీఎస్ కన్వీనర్ తొత్తరమూడి శ్రీనివాసరావు అన్నారు. కొత్తూరు జంక్షన్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద జరిగిన జెండా ఆవిష్కరణకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో అనేక సమస్యలపై పోరాటాలు చేసి హక్కులు సాధించుకున్నామని అన్నారు. ఎమ్మార్పీఎస్ ఉద్యమ ఫలితంగా వికలాంగులు, ఒంటరి మహిళలకు, గుండె జబ్బు పిల్లలకు ఆరోగ్యశ్రీతో పాటు, పింఛన్ల మంజూరు జరుగుతుందన్నారు. ఎమ్మార్పీస్ జిల్లా అధ్యక్షుడు యలకమల్లి బాబు, జిల్లా కోశాధికారి చెవ్వేటి అప్పారావు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కట్టుమూరి మంగరాజు, నాయకులు ఎలుసురి గాటీలు, కొల్లి చిన్న అప్పారావు, ఎత్తుల అప్పారావు, మంజేటి రాజబాబు, పెదపాటి రాణి, కోమలి, చెవ్వేటి సోమరాజు, కుమార్, నిమ్మిడి తల్లి ఈశ్వరరావు పాల్గొన్నారు.

- పట్టణంలో భీముని గుమ్మం అరుంధతీ సేవా సంఘం ఆధ్వర్యంలో సంఘం ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు లక్కిడపు పెంటారావు, జిల్లా నాయకులు మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కృష్ణ మాదిగ 30 ఏళ్ల సుదీర్ఘ పోరాట ఫలితమే ఎస్సీల్లో ఉన్న 59 ఉప కులాల వారికి సమన్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

పరిశుభ్రతతో వ్యాధులు దూరం


నాగులాపల్లిలో పారిశుధ్య డ్రైవ్ నిర్వహిస్తున్న డీఎల్‌డీవో మంజులావాణి, ఎంపీడీవో మన్మథరావు

మునగపాక: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని డీఎల్‌డీవో మంజులావాణి సూచించారు. మండలంలోని నాగులాపల్లిలో పారిశుధ్యం స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా గురువారం ప్రజలకు అవగాహన కల్పించారు. సీజన్‌లో అంటువ్యాధులు ప్రబలకుండా ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇంటి ముందు నీరు నిలువ లేకుండా చూసుకోవాలన్నారు. డయేరియా, మలేరియా, డెంగ్యూ వంటి రోగాలు సోకకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ వెంకటలక్ష్మి, ఎంపీడీవో మన్మధరావు తదితరులు పాల్గొన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి


సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ డీఈవో అప్పారావు


హాజరైన ప్రధానోపాధ్యాయులు

ఎస్.రాయవరం: పాఠశాలల్లో ప్రతి తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టి, శిక్షణ ఇవ్వాలని యలమంచిలి డిప్యూటీ డీఈవో పి.అప్పారావు అన్నారు. మండలంలోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు పి.ధర్మవరం ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మధ్యాహ్న భోజన పథకంపై పర్యవేక్షణ చేస్తూ నాణ్యత ప్రమాణాలు పాటించేలా చూడాలన్నారు. అలాగే ఎస్ఎంసీ ఎన్నికలపై ఉపాధ్యాయులు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. వివాదాలు లేకుండా ఎస్ఎంసీ ఎన్నికలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి ఏఎస్ఎస్ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

వరిలో యాజమాన్య పద్ధతులు పాటించాలి


రైతులకు సూచనలిస్తున్న మండల వ్యవసాయాధికారి జ్యోత్స్నకుమారి

మునగపాక: వరి సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలని మండల వ్యవసాయాధికారి జ్యోత్స్నకుమారి సూచించారు. గురువారం మండలంలోని ఉమ్మలాడ యూనిట్ ఆధ్వర్యంలో ఒంపోలులో ఆకుమడులు పరిశీలించిన ఆమె రైతులతో మాట్లాడారు. వరి విత్తనాలు శుద్ధి చేయడం ద్వారా తెగుళ్ల సోకకుండా చూడవచ్చన్నారు. తద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. ఎరువుల విషయంలో రైతులు జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి లక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

మాకవరపాలెం: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం మంజూరు చేసిన పాఠ్య, నోట్ పుస్తకాలను గురువారం సర్పంచ్ అల్లంపల్లి శిరీష్, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు రుత్తల శేషుకుమార్ గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యాభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

జోరందుకున్న వరి నాట్లు


ఎం.కోడూరులో వరినాట్లు వేస్తున్న దృశ్యం

మాడుగుల రూరల్: పది రోజులుగా అడపాదడపా కురుస్తున్న వర్షాలకు పంట భూముల్లో నీరు చేరింది. దీంతో రైతులు దమ్ములుపట్టి, వరి నాట్లకు సిద్ధమయ్యారు. తాచేరు, శారదానది, పాలగెడ్డ, చింతగెడ్డ నుంచి వస్తున్న నీటితో చెరువులు, జలాశయాలు కళకళలాడుతున్నాయి. మండలంలోని పెద్దేరు, తారకరామ, గౌర్రిగెడ్డ, పాలగెడ్డ జలాశయాల్లో నీటి మట్టాలు గణనీయంగా పెరిగాయి. వరినారు కూడా పచ్చగా ఎదగడంతో రైతులు నాట్లు వేసే పనుల్లో నిమగ్నమయ్యారు. ఈ ఏడాది మండలంలో సుమారు 13 వేల ఎకరాల్లో వరి సాగు లక్ష్యంగా అధికారుల అంచనా. వాతావరణ పరిస్థితుల అనుకూలత నేపథ్యంలో లక్ష్యానికి మించి సాగు విస్తీర్ణం పెరగవచ్చని రైతులు చెప్పున్నారు. రైతులంతా ఒకేసారి నాట్లుకు సిద్ధమవడంతో మహిళా కూలీలకు, దమ్ము పట్టే ట్రాక్టర్లు, పవర్ టిల్లర్లకు డిమాండ్ నెలకొంది.